క్లుప్తంగా

ఆర్‌ఎంపీ, పీఎంపీల కార్యవర్గం

భైంసాటౌన్: భైంసా మండల ఆర్‌ఎంపీ, పీ ఎంపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం భైంసా పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అర్జున్, ఉపాధ్యక్షులుగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, కోశాధికారిగా తుకారాం, సహాయ కార్యదర్శులుగా రాజు, శంకర్, సలహా సభ్యులుగా విజయ్‌కుమార్, అశోక్, గణపతి, భోజారెడ్డి, కపిల్‌ను ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులు మోహన్, కార్యదర్శి సాగర్, కుబీర్ మండలాధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



సాసర్ పిట్‌లో నీళ్లు నింపుతున్న సిబ్బంది

కుంటాల: వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్‌బీవో హరిలత తెలిపారు. బుధవారం మండలంలోని ఓలా బీట్‌లోని మెదన్‌పూర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆరు సాసర్ పిట్‌లలో నీళ్లు నింపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వర్షాలు కురిసే వరకు ట్యాంకర్లతో నీళ్లు నింపుతామని ఎఫ్‌బీవో పేర్కొన్నారు. అడవి జంతువుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

నర్సరీ పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి నర్సరీని బుధవారం ఈజీఎస్ ఏపీవో ప్రమీల తనిఖీ చేశారు. ఈసందర్భంగా నర్సరీలోని మొక్కలను పరిశీలించి ఎఫ్ఏకు పలు సూచనలు చేశారు. ఎండల నేపథ్యంలో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వారి వెంట టీఏలు దినేశ్, భీమ్, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'న్యాయవాదిపై దాడి హేయమైన చర్య'

ఖానాపూర్: న్యాయవాదిపై దాడి చేయడం హేయమైన చర్య అని.. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. బుధవారం పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సీనియర్ న్యాయవాది వెంకటమహేంద్రను వారు పరామర్శించి మాట్లాడారు. వెంకటమహేంద్రపై ఇటీవల ఇద్దరు వ్యక్తులు భౌతిక దాడికి దిగడం సరి కాదని పేర్కొన్నారు. వారి వెంట లక్ష్మీనర్సయ్య, దశరథ్, కృష్ణమోహన్, మహేశ్వర్, రాజేందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, మురళి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో ఏకిరెడ్డి లింగన్నకు చెందిన మేక బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజు మాదిరి గ్రామశివారులోని చేనులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్తింగ్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.15వేలు ఉంటుందని.. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు వేడుకున్నాడు.

'నేటి సభను విజయవంతం చేయాలి'

లక్ష్మణచాంద: నిర్మల్‌లో గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు ప్యాకెట్లు ఇస్తున్న సుగుణ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు బుధవారం ఏఎన్‌ఎం సుగుణ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వినియోగించాలని సూచించారు. ఆశవర్కర్ శారద తదితరులు ఉన్నారు.

ఓటేసిన ఉపాధ్యాయులు

కుంటాల: లోకసభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా భైంసా ఆర్డీవో కార్యాలయంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పీఆర్టీయూ రాష్ట్ర నేతలు సక్రపు గజేందర్, తాటి సోమేశ్వర్, దాసరి రమేశ్, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు ఉన్నారు.

లక్ష్మణచాంద: ఎన్నికల విధులు నిర్వర్తించే మండలంలోని అధికారులు జిల్లా కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. కిషన్, గంగాధర్, నారాయణ, మారన్న, నాగభూషణ్, రాజన్న తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలకు వేళాయె..

- ఫలితాల ఆధారంగా ఎరువులు అందిస్తే అధిక దిగుబడులు
- రైతులకు తగ్గనున్న పెట్టుబడులు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు



గాయిద్‌పల్లిలో భూసార పరీక్ష కోసం చేను నుంచి మట్టి సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

మామడ: రైతులు ఏయే భూముల్లో ఏయే పంటలు సాగు చేయాలి.. నేల స్వభావాన్ని బట్టి ఏయే పంట వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. నేల సారవంతం అయిందా.. కాదా అనే వివరాలు తెలుసుకునేందుకు భూసార పరీక్షలు కీలకం. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తూ.. తరచుగా పంట మార్పిడి పద్ధతి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 4.27 లక్షల ఎకరాల్లో సాగు..

సాగుకు ముందు జనుము, జీలుగ, పెసరి, పచ్చిరొట్ట ఎరువులు వాడితే పంటల దిగుబడులు పెరుగుతాయి. జిల్లాలో సాధారణంగా వానాకాలం సాగులో వరి 1.10లక్షల ఎకరాలు, పత్తి 1.45లక్షలు, సోయాబీన్1.15లక్షలు, మొక్కజొన్న 32వేలు, కంది 9,500 ఎకరాలలో, పసుపు 16వేల ఎకరాలు మొత్తం 4.27 ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. యాసంగిలో మాత్రం రెండు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు.

మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం కాగా ఇందులో ముఖ్యమైనవి నైట్రోజన్, ఫాస్పరస్, పోటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్. కొందరు రైతులు ఒకే పంటను తరచుగా సాగు చేస్తుండటంతోపాటు రసాయన ఎరువులను వినియోగిస్తుండటంతో భూమి సారం కోల్పోయి దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

సమావేశాలకే పరిమితమైన రైతువేదికలు..

ప్రభుత్వం ప్రతి ఐదు వేల ఎకరాలకో క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోను నియమించి రైతువేదిక ఏర్పాటు చేశారు. ఈ ఏఈవో క్లస్టర్ పరిధిలోని రైతులకు సాగులో మెళుకువలపై సూచనలు అందిస్తారు. జిల్లాలో 79 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. గతంలో రైతువేదికల్లోనే భూసార పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు.

పరీక్షలతో ఆశించిన దిగుబడులు..

గతంలో రైతువేదికలో భూసార పరీక్షలు చేయాలని నిర్ణయించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఈ సారి జిల్లా కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రంలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్లస్టర్ పరిధిలోని ఏఈఓలు రైతుల పంట చేల నుంచి మట్టి నమూనాలను సేకరించి నిర్మల్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి. వచ్చిన భూసార పరీక్ష ఫలితాలను రైతులకు వివరించి పంటల సాగుపై సూచనలు చేయాల్సి ఉంటుంది. భూసార పరీక్షల కోసం చేల నుంచి మట్టి నమూనాలు సేకరించే విధానంపై ఇప్పటికే ఏఈఓలకు అవగాహన కల్పించారు.

రైతువేదికల్లోనే నిర్వహించాలి



భూసార పరీక్షలను జిల్లా కేంద్రంలో కాక రైతు వే దికల్లోనే నిర్వహించాలి. వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లి భూసార పరీక్షలతో కలిగే లాభాలను వివరించాలి. అవసరమైతే ఖర్చులు మేమే భరిస్తాం. ఏయే పంటలు సాగు చేస్తే మంచిదో వారు చెప్పాలి.

– ఆశన్న, పొన్కల్

పెట్టుబడులు తగ్గుతాయి..



నేను పదెకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నా. మా భూమి నుంచి వ్యవసాయాధికారులు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేశారు. ఫలితాల ప్రకారం పంటకు యూరియా, డీఏపీ ఎరువులు తక్కువ అవసరమయ్యాయి. ఎకరాకు ఐదు వేలకు పైగా పెట్టుబడులు తగ్గాయి.

– భీంరెడ్డి, రైతు, కొరిటికల్

భూసార పరీక్షలతో మేలు



భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. పెట్టుబడులు తగ్గి రైతులకు మేలు జరుగుతుంది. జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షల కేంద్రంలో మట్టి నమూనాల పరీక్షలు నిర్వహిస్తాం. రైతులు పరీక్షల కోసం ఏఈవోలను సంప్రదించాలి.

– అంజిప్రసాద్,జిల్లా వ్యవసాయ అధికారి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోవద్దు

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సారంగపూర్: కొట్ల(బి)లో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



పొట్టపెల్లిలో కూలీలతో మాట్లాడుతున్న నేతలు

సారంగపూర్: సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మలక్‌చించోలి, వంజర్, కొట్ల(బి) గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు అండగా నిలువడంతోపాటు బీజేపీ ఏనాడూ అవినీతి క్రమాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ పేరు చెప్పుకొని ఓట్లడగడమే తప్ప చేసిందేం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడానికి కారణం బీఆర్‌ఎస్ నేతలేనని అన్నారు. ప్రజలు కమలం గుర్తుకే ఓటువేసి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని కోరారు. గంగారెడ్డి, పోతన్న, సాహెబ్‌రావు, శ్రావణ్‌కుమార్, విలాస్, తిరుమలచారి, నాయకులు ఉన్నారు.

సోన్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలను కోరారు. ముత్కపల్లి నరేశ్, సంతోష్, వెంకటేశ్, రాజు, అశోక్, గణేశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల ఇన్‌చార్జి తాటివార్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే)లో ఉపాధి కూలీలకు వద్దకు వెళ్లి బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, గోవర్ధన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబుగామలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, ఎంపీటీసీలు కవిత, కట్ట రవి, కల్యాణ్ గజేందర్, జక్కుల గజేందర్, తాటి శివ, అశోక్ కుమార్, సోమ సత్తయ్య, సూర్య వంశీసాయి, మహేందర్, గోవర్ధన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కడెం: కల్లెడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు



సర్పాపూర్(జి)లో మాట్లాడుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి

దస్తురాబాద్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని దేవునిగూడెం, రాంపూర్, మల్లాపూర్, గొడిసీర్యాల, మున్యాల, రేవోజీపేటలోని ఆదివాసీ గూడేల్లో సుగుణను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల వలసలను నివారించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రాంపూర్, దేవునిగూడెం గ్రామాల్లో 160 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు దేవునిగూడెం మాజీ సర్పంచ్ అంజన్న, ఉపసర్పంచ్ భూమారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారి వెంట ఎంపీపీ కిషన్, పార్టీ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, దేవునిగూడెం గ్రామ అధ్యక్షుడు ఎండపెల్లి వెంకటేశ్ రమేశ్‌రావ్, శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీ రూ.400కు పెంచుతామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కల్లెడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేంలేదని విమర్శించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, రమేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అందాకూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి బుచ్చన్న, బండి రమణగౌడ్, నవీన్, ఫారూఖ్ తదితరులు ఉన్నారు.

'ప్రజలకు చేసిందేం లేదు'

సర్పాపూర్(జి): కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గురడిరెడ్డి కాపు సంఘ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రజలకు చేసిందిఏం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. ఎంపీ అభ్యర్థి సుగుణ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు అల్లోల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ చిన్న రామయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, సట్ల సాయేందర్, మండల కోఆప్షన్ సభ్యులు ఫసి, గంగారాం, మహేందర్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సారంగాపూర్, కొట్ల(బి) గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, సలీం, బోరిగాంలో ఏనుగు ముత్యంరెడ్డి, మల్లారెడ్డి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆదిలాబాద్ ఎంపీగా పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జగదీశ్వర్, అబ్దుల్ హాదీ, అశోక్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

' సుగుణను గెలిపించాలి'

ఖానాపూర్: ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో ఇండియా కూటమి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి, నర్సయ్య, శంభు, నారాయణ, రాజేశ్, గంగారాం, తదితరులు ఉన్నారు.

'మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి'

ఖానాపూర్: మున్నూరుకాపుల సంక్షేమానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయనను తిమ్మాపూర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవోను జారీ చేసిందన్నారు. హామీని అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్, నాయకులు తోట సత్యం, లక్ష్మణ్, కిశోర్, శంకర్, గంగాధర్, శ్రీనివాస్, సచిన్, రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఓటర్లకు ఇబ్బంది రానీయొద్దు



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్



కుంటాలలో కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

- డీపీవో శ్రీనివాస్

భైంసారూరల్: ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వానల్‌పాడ్, వాటోలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం డీపీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా అయన పాఠశాలలోని విద్యుత్ సరఫరా, ఫర్నీచర్, నీటివసతి, మరుగుదొడ్లు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈసీ రాజేశ్వర్, కార్యదర్శులు గాయిత్రి, అనిత తదితరులు ఉన్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని దౌనెల్లి, కుంటాల పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించడంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ అడెల్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద, రాణి గుణసుందరి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



ఖానాపూర్ : సత్తనపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ముథోల్: బాసరలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. శ్యామ్, రాజుపటేల్, దారాసింగ్, బాపూరావు, మాధవరావు, నాగరాజ్, శ్రీనివాస్, రవి, సాయికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముథోల్ మండలంలోని వితోలితండా, ఎడ్‌బిడ్‌తండా, వడ్తాల గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ గంగాధర్, విఠల్, ముత్యం, బాబు, గణపతి, గంగాధర్ తదితరులున్నారు.

ఖానాపూర్: రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని సత్తనపల్లి, సేవ్యానాయక్ తండాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి ఎంపీ అభ్యర్థి సక్కును గెలిపించాలని కోరారు. అనంతరం పట్టణంలోని కాలనీల్లో ప్రచారం చేశారు. దామెర శ్రీనివాస్, అల్లి రాజమల్లు, అల్లి మల్లేశ్, బేర తిరుమలేశ్, నాసాని రెడ్డి, అమ్రు నాయక్, మహేందర్, ఉత్తం, నరేందర్, రమేశ్, సత్యంరెడ్డి, రాజు, తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

తానూరు: రోజురోజుకు పెరుగుతున్న ఎండల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. 13న జరిగే ఎంపీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో శుభ్రతపై దృష్టి సారించడంతోపాటు నర్సరీల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, టీఏలు తదితరులు ఉన్నారు.

'మందోట స్థలం వీడీసీదే'

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పరిధిలో మార్కెట్‌యార్డు సమీపంలోని మందోట స్థలం ఖానాపూర్ వీడీసీదేనని వీడీసీ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో వీడీసీ పరిధిలోని 15 కుల సంఘాల నాయకులు మాట్లాడారు. వీడీసీ ఆధ్వర్యంలో మందోట కోసం కొన్నేళ్ల కిందట కొన్న స్థలాన్ని.. దాన్ని విక్రయించిన వ్యక్తే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని పేర్కొన్నారు. సదరు స్థలంలో ఉన్న కంచెను ధ్వంసం చేసి కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. వీడీసీ అధ్యక్షుడు సతీశ్‌రావు దేశ్‌పాండే, మైలారపు గంగాధర్, లాండేరి కిషన్, భూసారపు గంగాధర్, దాసరి బీమన్న, నేత శ్యామ్, ఒల్లాల చిన్ననర్సాగౌడ్, బ్రహ్మరౌతు నర్సయ్య, అల్వాల శ్రీనివాస్, మద్దెల రాజన్న, రాజేశ్వర్, గంగరాజం, శంకర్, రాజన్న, పోశన్న, తదితరులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఖానాపూర్: అయోధ్య రామాలయం, అక్షింతలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని భజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ మాట్లాడారు. హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం హిందువుల మనోబావాలను దెబ్బతీస్తే ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీఐ సైదారావు అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు వేసవి శిబిరం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్, లోకేశ్వరం ప్రభుత్వ పాఠశాలల్లో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిబిరం బుధవారం ప్రారంభించినట్లు ఫౌండేషన్ బోధకుడు నవీన్‌కుమార్ తెలిపారు. ప్రతి పాఠశాలలో 10 రోజులపాటు నిర్వహించే శిబిరంలో విద్యార్థులకు ఇంజినీరింగ్ ఆధారిత కృత్యాలు నేర్పుతామని పేర్కొన్నారు. పేపర్ బొమ్మలు, సృజనాత్మకపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. స్తంభాలను సరిచేయరూ..



సర్పాపూర్(జి): మండలంలోని అంజనితండా గ్రామంలో రాథోడ్ శ్రీనివాస్‌కు చెందిన చేనులో రెండు విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే స్తంభాలను సరి చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, ఏఈ, సర్పాపూర్(జి), ఫోన్: 94408 14879